సేకరించిన చెత్తంతా రోడ్డు పాలు!

- సేకరణలో వచ్చిన వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించని వైనం
- రోడ్ల వెంట పడేస్తున్న చెత్త, ఆపై కుప్పలకు నిప్పు
- వట్టి మాటలుగా సంపద సృష్టి

ప్రత్తిపాడు: నడింపాలెం గ్రామ పంచాయతీ అధికారులు జిల్లా ఉన్నతాధికారులను పైపై హంగులతో మాయ చేస్తున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీని క్లీన్‌గా ఉంచుతూ ఊరిని చెత్తకు వదిలేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు 8 మంది, షెడ్ మిత్ర ఒకరు ఉన్నారు. వీరు ఇంటింటికి తిరిగి రిక్షాలు, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. ఆ వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి.. తడి చెత్త ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువు తయారు చేయడం.. పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుకోవడం వంటివి చేయాల్సి ఉంది. కానీ పంచాయతీ అధికారుల అలసత్వంతో కార్మికులు సేకరించిన వ్యర్థాలు, చెత్త ఎస్‌డబ్ల్యూపీసీకి చేరడం లేదు. స్థానికంగా ఊరి శివారులో ఉన్న డొంకల్లో వ్యర్థాల కుప్పలను రోజుకో ప్రదేశంలో పడేసి, అక్కడే నిప్పు పెట్టేస్తున్నారు.

ఒకప్పుడు హెల్దీ పంచాయతీ..

గతంలో ఈ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ పనితీరు ఇతర మండలాలు, పంచాయతీలకు ఆదర్శంగా ఉండేది. ఢిల్లీ నుంచి ఏపీకి వచ్చే కేంద్ర బృందాలు, ట్రైనీ కలెక్టర్లు సైతం ఈ ఊరికి వచ్చి షెడ్‌ను సందర్శించి, నిర్వహణపై ఆరా తీసేవారు. ఇదే పంచాయతీకి దేశ స్థాయిలో హెల్దీ పంచాయతీగా పురస్కారం కూడా లభించింది. దీంతో ఇప్పటికీ అప్పుడప్పుడూ ఆ షెడ్‌కు అధికారుల తాకిడీ ఉంటుంది. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు ఎప్పుడు ఏ అధికారి వస్తారో, షెడ్‌ను విజిట్ చేస్తారోనని షెడ్‌ను మాత్రం శుభ్రంగా ఉంచుతూ అధికారుల కళ్లకు స్వచ్ఛ గంతలు కడుతున్నారు. గ్రామం నుంచి సేకరించే చెత్తను మాత్రం ఎక్కడ పడితే అక్కడ పడేసి తగలబెట్టేస్తున్నారు.



గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్

తడి చెత్తను మాత్రం తరలిస్తున్నాం

చెత్త సేకరణకు వెళ్లినప్పుడు కొంత మంది ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయకుండా అలానే పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్నారు. అందుకనే వాటిని అలా బయట ఊరి చివర పడేస్తున్నారు. అయినప్పటికీ అలా చేయవద్దని సిబ్బందికి చెప్పాము. తడి చెత్తను మాత్రం ఎస్‌డబ్ల్యూపీసీకే తరలిస్తున్నాం.

జీవీఆర్‌కే మూర్తి, పంచాయతీ కార్యదర్శి, నడింపాలెం

క్లుప్తంగా

కౌలు రైతులకు కార్డులు వెంటనే అందజేయాలి

పొన్నూరు: మండలంలోని అర్హులైన కౌలు రైతులకు వెంటనే సీసీఆర్‌సీ కార్డులను ఇవ్వాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ వీఆర్‌వోలను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో కౌలు రైతులు 3,978 మందికి కార్డులు ఇవ్వాలని చెప్పారు. వీఆర్‌వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పనిచేసి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కార్యాలయ పర్యవేక్షకులు ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మగతాటి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఆరు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ రాక ఇబ్బందులు



ప్రత్తిపాడు: ఆధార్ మొబైల్ క్యాంపును సమస్యలు వెంటాడుతున్నాయి. ఒకసారి సిబ్బంది సమస్య, మరోసారి సర్వర్ సమస్యగా మారుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఆధార్ మొబైల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం స్థానిక సచివాలయంలో క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. విషయం ముందుగానే గ్రామస్తులకు తెలియజేయడంతో ప్రజలు సచివాలయం వద్దకు ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం వచ్చారు. అయితే ఉదయం సమయంలో ఆధార్ క్యాంప్ నిర్వహించేందుకు సిబ్బంది అందుబాటులో లేరు. మధ్యాహ్నం నుంచి సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ సర్వర్ మొరాయించింది. దీంతో చంటిబిడ్డలను ఎత్తుకుని సచివాలయాలకు వచ్చిన వారు, ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కాగా ఉదయం వచ్చిన వారు ఆధార్ సిబ్బంది లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



నెహ్రూనగర్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు కనపరిచిన విద్యార్థులకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర బహుమతులు అందజేశారు. నగరంలోని పట్టాభిపురం మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 2024–25లో పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదే విధంగా పాఠశాలలో 10 వ తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన హాసినీని మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, పూర్వ విద్యార్థులు చావాలి గణపతి, కామేశ్వరరావు, రఘుకుమార్, పతంజలి, కృష్ణ శాస్త్రి, నరహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ పంచరత్నంపై ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదికపై శ్రీజగత్‌గురు శంకరాచార్య విరచిత గణేష్ పంచరత్నంపై నిర్వహిస్తున్న ప్రవచనాల ముగింపు సభ బుధవారం చేపట్టారు. సుందర సత్సంగ సభ్యులు కేవీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ మంత్రాలలో మొదటిది ఓంకారం అని అన్నారు. పూజల్లో మొదటి వాడు గణపతి అని పేర్కొన్నారు. తొలుత ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, ఏకాంబరేశ్వరరావు, బసవేశ్వరరావు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం


శివశంకర్

లక్ష్మీపురం: బాలలుడి అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్‌కు చెందిన జిష్ణు శివశంకర్ అలియాస్ పండు(14) ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బాలుడి స్నేహితులు, పాఠశాల యాజమాన్యాన్ని విచారించినా ఫలితం లేకపోవడంతో అరండల్‌పేట పోలీసులకు తల్లి పార్వతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవోను ప్రశ్నించిన కొండేపాడు గ్రామస్తులు


ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న పింఛను లబ్ధిదారులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని కొండేపాడుకు చెందిన ముగ్గురు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు అర్హత అనుమానం పేరుతో ఆరు నెలలుగా అధికారులు పింఛను ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో కె.శివపార్వతి విచారణ నిర్వహించనున్నారని.. విచారణకు హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులకు తెలిపారు. దీంతో లబ్ధిదారులైన పచ్చల శ్రీనివాసరావు, గొల్లపూడి వేణుగోపాల ప్రసాద్‌లు హాజరు కాగా ఆమె వారితో మాట్లాడారు. ఇప్పటికే నాలుగు సార్లు పీజీఆర్‌ఎస్‌ల్లో ఫిర్యాదులు చేశామని, కానీ ఒక్కసారి కూడా ఊర్లోకి రాకుండా, గ్రామస్తులను విచారించకుండా డోర్‌లాక్ అని ఉండడంతో పింఛను పంపిణీ చేయలేదని లబ్ధిదారులు మండిపడ్డారు. స్పందించిన శివపార్వతి పింఛను పంపిణీ చేయవద్దని నేను ఎవ్వరికీ చెప్పలేదని తెలిపారు. ఈ విషయమై మేము కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది మీ మీదనేనని.. అలాంటప్పుడు మీరే ఎలా విచారణ నిర్వహిస్తారని లబ్ధిదారుడు వేణుగోపాలప్రసాద్ ఎంపీడీవోను ప్రశ్నించారు. దీంతో జెడ్పీకి ఫోన్ చేసిన ఆమె లబ్ధిదారులు పై విధంగా ప్రశ్నిస్తున్నారని ఎంపీడీవో చెప్పారు. విచారణ చెయ్యమని కాదని, పింఛను ఎందుకు నిలిపివేశారో రాసి పంపమని జెడ్పీ కార్యాలయ అధికారులు ఎంపీడీవోకు వివరించారు.

ఫీడర్ ఛార్జ్‌తో నిరంతర విద్యుత్ సరఫరా


ఫీడర్ ఛార్జ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ సీహెచ్ రమేష్

లాల్‌పురం(ప్రత్తిపాడు): ఫీడర్ ఛార్జ్‌తో ప్రజలు, వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించనున్నామని ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఎస్‌ఈ సీహెచ్ రమేష్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాల్‌పురం పంచాయతీ పరిధిలోని 33/11 కేవీ ఉపకేంద్రంలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఆర్‌డీఎస్‌ఎస్ స్కీం ద్వారా 11 కేవీ కామాక్షినగర్ ఫీడర్ ఛార్జ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఫీడర్ ఛార్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌ఈ ఫీడర్ ఛార్జ్‌ను ప్రారంభించారు. ఫీడర్ ఛార్జ్‌తో ఏసుభక్తనగర్, కామాక్షినగర్, లాల్‌పురం లింక్‌రోడ్, సుబ్బారెడ్డి నగర్ వాసులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, డీఈఈలు బి.రాజమోహన్‌రావు, ఉదయ్‌కుమార్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

28న 'చలో తెనాలి' జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

లక్ష్మీపురం: ఈనెల 28న చలో తెనాలి మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నగర కమిటీ పిలుపు నిచ్చింది. బుధవారం 41వ డివిజన్ సుందరయ్య నగర్‌లో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు కరపత్రాలను కేవీపీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోనే లూథర్ పాల్, ఆది నికల్సన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ తెనాలి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ చేసిన వ్యక్తులపై ఉన్నత న్యాయస్థానాలు, జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ పార్టీ నేతలు, సామాజిక ఉద్యమకారులు, న్యాయవాద సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, దళిత బహుజన ప్రజాసంఘాలు, మానవతావాదులు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్‌వలి, ఖాశింవలి, నాయుడు పద్మ, ఉష్ణమా పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రి వీరాంజనేయ స్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

నెహ్రూనగర్: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెలగపూడిలోని ఆరుగురు మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించి ఇచ్చిన జీఓ నంబర్ 5ను సవరించి గ్రామ సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. బదిలీలు అత్యంత పారదర్శకంగా జరిగేలా సీనియారిటీ/మెరిట్ ఆధారంగా జరపాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యంగా చేయడం వలన రావాల్సిన బకాయిలు, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులందరకి స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి, మెరుగైన పదోన్నతి చానల్ కల్పించాలని, జీఓ నంబర్ 523ను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు షేక్ అబ్దుల్ రజాక్, ఆర్లయ్య, ప్రభాకర్, యువ షణ్ముఖ్, జోసెఫ్ కిషోర్, మహాలక్ష్మి, మధు, సత్య, జగదీష్ పాల్గొన్నారు.

అర్హత కోల్పోయిన వారిపై చర్యలు తీసుకోండి

గుంటూరు వెస్ట్: జీఓ నంబర్ 154 ప్రకారం అర్హత కోల్పోయిన వారిపై చర్యలు తీసుకోవాలని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోల నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన వారు జీఓ నంబర్ 154 ప్రకారం రెండు సంవత్సరాల కాలపరిమితిలో డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లతోపాటు సర్వే టెస్టులు కూడా పూర్తి చేయాలని తెలిపారు. అయితే, పదోన్నతి పొందిన 66 మందిలో 31 మంది ఈ పరీక్షలు రాయలేదని పేర్కొన్నారు. సంవత్సర కాలంగా వీరంతా అనర్హులుగా విధుల్లో కొనసాగుతున్నారని, వీరిని మళ్లీ వీఆర్వోలుగా రివర్షన్ చేయాలని కోరారు. అర్హత ఉన్న వీఆర్వోలకు ఖాళీగా పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. ఇదే అంశంపై గతంలో నాలుగు సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పుడు డీఆర్వో స్పందించి నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు టి.శ్రీనివాసరావు, సీహెచ్. లూర్దు రాజు, విజయ్, జీవ్లా నాయక్, జి.భూలక్ష్మి, రవి కుమార్ పాల్గొన్నారు.

నిర్ణీత కొలతల ప్రకారమే ఉపాధి పనులు



ప్రత్తిపాడు: ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేపడితే పూర్తి కూలి చెల్లించనున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ బి.శ్యామలాదేవి అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో నిర్మాణంలో ఉన్న సేద్యపు నీటి కుంటను, గనికపూడిలో జరుగుతున్న పంట కాలువ పూడిక తీత పనులను బుధవారం ఆమె స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. పనులకు హాజరైన కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు నమోదు చేసిన మస్టర్లును చెక్ చేశారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వెంట ప్రత్తిపాడు ఏపీవో ఏడుకొండలు, టీఏ మస్తాన్ వలి, ఈసీ శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

దారి తప్పి వచ్చిన బాలిక

పోలీసులకు అప్పగించిన యువకుడు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఓ బాలిక అటు ఇటు తిరుగుతుండటంతో రోడ్డుపై ప్రయాణించే ఓ యువకుడు గమనించి, ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చి బుధవారం తాడేపల్లి పోలీసులకు అప్పగించాడు. అడ్రస్ చెప్పలేకపోవడంతో అప్పగించాడని, ఆ పాప ఎవరనేది విచారణ చేస్తున్నామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. మతిస్థిమితం లేదని, పేరు హంసిని అని మాత్రమే చెబుతోందన్నారు. డోలాస్‌నగర్‌లోని మేరీ హోమ్స్ సంరక్షణలో ఉంచామని చెప్పారు. పాపకు తల్లి దండ్రులు లేరని చెబుతోందని, అమ్మమ్మ, తాతయ్య ఉన్నారని, అయితే వాళ్ల పేర్లు, ఊరు చెప్పలేకపోతోందన్నారు. ఎవరైనా ఈ పాపను గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను కలవాలని ఆయన కోరారు.

వృద్ధురాలి బ్యాగ్‌లో నగదు మాయం

తాడేపల్లి రూరల్: ఓ వృద్ధురాలి బ్యాగ్‌లో నగదు మాయమైన సంఘటనపై బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. వృద్ధురాలు కోటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. మహానాడులో నివాసం ఉండే ఆమె నడుచుకుంటూ మణిపాల్ సెంటర్ వద్దకు వెళ్లారు. మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీకి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. తన మనుమరాలు పెళ్లి నిమిత్తం రూ.50 వేల నగదు తన బ్యాగ్‌లో పెట్టుకుని బంధువుల ఇంటికి వెళుతున్నారు. ఇద్దరు ఉన్న ఆటోలో ఆమె ఎక్కగా.. ఆటోలో మార్గం మధ్యలో మరో ఇద్దరు ఎక్కారు. ఆటో దిగగా బ్యాగ్‌లోని నగదు మాయమైంది. నలుగురిలో నగదు ఎవరో తీసి ఉంటారని.. పోలీసులు వృద్ధురాలు ఎక్కిన ఆటో వివరాలు సేకరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వడ్డేశ్వరం విద్యార్థులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రస్థాయిలో జరుగనున్న రగ్బీ పోటీలకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో గుంటూరు జిల్లా రగ్బీ పోటీలు నిర్వహించారని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు యస్‌కే బాజీ (9వ తరగతి), కె.ప్రియ దుర్గ (9వ తరగతి), డి.సాహితి (9వ తరగతి) అండర్–18 రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 28, 29 తేదీల్లో కర్నూలులో జరుగనున్నాయని వివరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు జోజప్ప, ఎం.రవి, ఎస్.రవి, పీడీఎస్ శ్రీరామచంద్రరెడ్డి, చావ శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అండర్–18 బాల బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కర్నూలులో జరుగనున్న పోటీలలో పాల్గొంటారని పీడీఎస్ రవి తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగం అధ్యక్షుల నియామకం



పొన్నూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొన్నూరు నియోజకవర్గంలో 19 అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులుగా చుండూరు వీరయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా భీమవరపు విజయలక్ష్మీ, రైతు విభాగం అధ్యక్షులుగా పాకనాటి సుధాకర్, బీసీ సెల్ విభాగం అధ్యక్షులుగా కురాకుల ముక్తేశ్వరరావు, ఎస్సీసెల్ విభాగం అధక్షులుగా కక్కిలిగడ్డ కిరణ్, ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షులుగా బాపట్ల నాగ ప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షులుగా బానాల విజయ్‌కుమార్, విద్యార్థి విభాగం కనుగోలు గోపి నియమితులయ్యారు. పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులుగా అన్నదాసు సుబ్బారావు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షులుగా మెడిగ సుబ్బారావు, వలంటీర్ విభాగం అధ్యక్షులుగా బచ్చు అప్పిరెడ్డి, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షులుగా శివబత్తిని దయానంద్ బాబు, వీవర్స్ విభాగం అధ్యక్షులుగా రావిరాల వెంకట్రావు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా కట్టివరపు ఆశా జ్యోతి, కల్చరల్ విభాగం అధ్యక్షులుగా ఉప్పుమావులూరు శివరామకృష్ణ, ఐటీ విభాగం అధ్యక్షులుగా సుంకర నాగవర్ధన్ రెడ్డి, ఇంటిలెక్చువల్స్ ఫోరం విభాగం అధ్యక్షులుగా నల్లమోతు రవీంద్ర రెడ్డి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షులుగా చాగంటి మురళీకృష్ణ రెడ్డి, పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా బద్దూరి భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ


రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వరరావు

పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీతో బీపీటీ 5204, ఎంటీయూ1224 విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఐ.శ్రీకాంత్, యామిని, వ్యవసాయ గ్రామ సహాయకులు ఎస్.సురేష్ బాబు, పి.దుర్గమ్మ, రైతులు పాల్గొన్నారు.

పెదకాకాని: ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్ అన్నారు. మండల పరిధిలోని గోళ్లమూడి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి బలరాం, ఏఈఓ శివరాం, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: కౌలు రైతు కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఏవో షేక్ సుగుణ బేగం తెలిపారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులు భూములు కౌలుకు తీసుకున్నప్పుడు కచ్చితంగా గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం సిబ్బంది లేదా వీఆర్వోను సంప్రదించి కౌలు కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో చరణ్, వీఏఏ భవాని, రైతులు పాల్గొన్నారు.

కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయ ఒప్పందం


రెండు విశ్వవిద్యాలయాల మధ్య జరుగుతున్న ఒప్పందం

లాంఫాం(ప్రత్తిపాడు): ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయానికి యూఎస్‌ఏ మాన్‌హట్టన్‌కు చెందిన కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయానికి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయంలోని పాలకవర్గ సమావేశ మందిరంలో బుధవారం రెండు విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన కోసం సాంస్కృతిక, విద్యా, పరిశోధన అంశాల్లో పరస్పర సహాయ సహకారాలపై ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి దేవి సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్ డాక్టర్ రిచర్డ్ హెచ్. లింటన్‌ల మధ్య ఒప్పందం జరిగింది. పరస్పర ఆసక్తి ఉన్న పరిశోధనలను నిర్వహించడానికి, ఉపన్యాసాలు, స్వల్పకాలిక సందర్శనలకు ప్రొఫెసర్ల మార్పిడి, సమావేశాలు, సింపోజియాలు, బోధనలలో పాల్గొనడానికి ఆహ్వానాలు, పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో సమాచారం, విద్యా, ప్రచురణల మార్పిడికి రెండు సంస్థలు అంగీకరించాయి. కార్యక్రమంలో మాజీ ఉపకులపతి డాక్టర్ రఘువర్ధన్ రెడ్డి, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా.పి.మునిరత్నం, ఆయా విభాగాల డీన్‌లు చెరుకూరి శ్రీనివాసరావు, బి.శ్రీలక్ష్మి, ఏవీ రమణ, జి.కరుణసాగర్, వ్యవసాయ ఇంజనీరింగ్ డాక్టర్ ఎ.మణి, కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ పీవీ వరప్రసాద్, యూనివర్శిటీ డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ క్రూస్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు

ప్రత్తిపాడు: పీజీ ఈసెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న విడుదలైన ఏపీ పీజీ ఈసెట్ ఫలితాల్లో.. కళాశాలకు చెందిన 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించారన్నారు. అందులో ఎ.ఉమామహేశ్వరి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జి.తనూజ భాగ్యశ్రీ స్టేట్ ఏడో ర్యాంకు సాధించి విజయ దుంధుభి మోగించారని చెప్పారు. అంతే కాకుండా సీహెచ్ వీరమోహన్ రెడ్డి 25వ ర్యాంకు.. డి.వేళంగిణిరాణి 42వ ర్యాంకు.. కె.లక్ష్మీసాయి 64వ ర్యాంకు.. బి.తనూజ 99వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. వెయ్యిలోపు 22 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని చెప్పారు. అనంతరం చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.


మన్నెం కిరణ్‌కుమార్

పెదకాకాని: పీజీ సెట్ ఫలితాలలో పెదకాకాని గ్రామానికి చెందిన మన్నెం కిరణ్ కుమార్ ఏపీ స్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా మంగళవారం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలలో పెదకాకాని విద్యార్థి కిరణ్ కుమార్ రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి అందరి ప్రశంసలు పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు ప్రత్యేకంగా కిరణ్‌ను అభినందించారు.

ప్రమాదంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

లక్ష్మీపురం: దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎమర్జెన్సీ నాడు- నేడు అనే అంశంపై గుంటూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు పాశం రామారావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు పునరావృత్తం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత 11 ఏళ్లుగా దేశంలో ఎన్నికల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. రాజకీయాలను వ్యాపార సాధనంగా మార్చి వేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 2014 నుంచి దేశంలో కూడా అప్రకటిత అత్యవసర పరిస్థితులు పరోక్షంగా అమలు అవుతున్నాయన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కల్గిస్తున్నారని విమర్శించారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పాల్గొన్నారు.